సాగర్ డ్యాం వద్ద కేంద్ర జల వనరుల సంఘం ఉన్నతాధికారుల తనిఖీ

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 06 మార్చి , 2026 | పేజీలు : 06

గల్లంతైన యువకుడు మృతి..
సాగర్ కాలువలో శవం లభ్యం

ప్రజాపక్షం/హాలియా: నల్లగొండ జిల్లా హాలియా ఎడమ కాలువలో మంగళవారం గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది.స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హాలియా ఎస్ఐ సాయిప్రశాంత్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు.గజ ఈతగాళ్ల సహాయంతో రిజర్వాయర్‌లో గాలింపు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.గల్లంతైన వారి కుటుంబ సభ్యులు హాలియా పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

రెక్కాడితే తప్ప డొక్కాడని కుటుంబాలు...

రెక్కాడితే తప్ప డొక్కాడని కుటుంబాలు ఎదుగుతున్న తమ పిల్లలను చూసుకుంటూ తమకి మంచి రోజులు వస్తాయని నమ్మకంతో కష్టమెంతైనా భరించేలా చేస్తుంది. ఇందుకు సంబంధించిన సంఘటన ఒకటి హాలియాలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే హాలియాలో కొన్నేళ్లుగా నివాసముంటున్న సూరేపల్లి గ్రామానికి చెందిన ఆలేటి కోటేశ్వరి కి ముగ్గురు కొడుకులు. ఈమె భర్త ఏడేళ్ల క్రితమే ఒక రోడ్డు ప్రమాదంలో మృత్యున్నదంతో పిల్లలను తీసుకొని జీవనోపాధి వెతుక్కుంటూ హాలియాకు వచ్చారు. పిల్లలు చిన్న వయసులో ఉండగానే భర్త మృతిచెందడంతో అన్ని తానై తన పిల్లల్ని చదివించేందుకు నిత్యం కూలి పనులు చేస్తూ వచ్చే ఆదాయంతో వారి చదివిస్తూ జీవితం సాగిస్తుంది. ముగ్గురు పిల్లలలో హోలీ రోజు ఎడమ కాలువలో గల్లంతైన కార్తీక్ తన రెండవ సంతానం. పెద్ద కుమారుడు ఇంటర్, చిన్న కుమారుడు ఐదో తరగతి చదువుతున్నారు. వీరితోపాటు పెద్దవూర మండలం శిరసనగండ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ చారి తన ఇద్దరు కుమారులతో జీవనోపాధి కోసం హాలియాకు వచ్చాడు.జీవనోపాధి నిత్యం దొరకక ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ పిల్లల్ని చదివిస్తూ ఉన్నాడు.ఇద్దరు పిల్లలు బబ్లు చారి రెండోవాడు. ఇతను మంగళవారం హోలీ రోజు ప్రమాదవశాత్తు ఎడమ కాలువలో జారిపడి గల్లంతయ్యాడు. రెండు కుటుంబాలు రెక్కాడితే తప్ప డొక్కాడనివే. తాము ఎన్ని ఇబ్బందులు పడుతున్న తమ పిల్లల్ని చదివించుకుని ఒక ఉన్నత స్థాయిలో చూడాలన్న వారి కోరిక అనుకోని ఇలాంటి ప్రమాదాల వల్ల గల్లంతైపోతుంది. ఏ ప్రమా దం ఎప్పుడు ఎలా జరుగుతుందో ఎవరికి తెలియని విషయమే. అయినా మనం చేసే పనులు మన ప్రాణాల మీదికి వచ్చేవరకు తెలియక మనను కన్నవారికి కడుపుకోతను మిగుల్చుతున్నాం. కుటుంబా ఆధారం పోయినా తన పిల్లలే జీవితం గా భావించి ఆ తల్లి పిల్లల కోసం తన డొక్క మాడ్చుకుని పిల్లల్ని ప్రయోజకుల్ని చేయాలనుకునే ఆ తల్లి కోరిక ఎడమ కాలువ రూపంలో గల్లంతు చేసింది. వెంకటేష్ చారి కుటుంబం కూడా జీవనోపాధి కోసం హాలియాకు వచ్చి కొడుకుల్ని చదివించుకోవాలని ఆ తండ్రి కోరిక కూడా ఎడమ కాలువ రూపంలో బబ్లు చారి గల్లంతై వారి కుటుంబాన్ని అగాధంలోకి నెట్టింది. ఎడమ కాలువలో ఉధృతంగా నీటి ప్రవాహం ఉన్న సంగతి ప్రత్యక్షంగా చూస్తున్న ఎంతోమంది దప్పిక కోసమో, కాలువలోకి దిగాలనే సరదా కోసమో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎడమ కాలువలో గల్లంతైన ఈ ఇద్దరి చిన్నారుల సంఘటనైన నేటి యువత కళ్ళు తెరిపిస్తాయని ఆశిద్దాం.

చికిత్స ఉంది...భవనం ఏదీ..?

శిథిల గృహంలో పశువైద్య సేవలు

ప్రజాపక్షం/నందికొండ: దీనిని ఎవరైనా పశువైద్యశాల అనుకుంటే పొరపాటే. శిథిలావస్థలో ఉన్న పాత ప్రభుత్వ గృహంలోనే పశువులకు వైద్యసేవలు అందుతున్న దృశ్యం నందికొండ మున్సిపాలిటీలో కనిపిస్తోంది. స్వంత భవనం లేకపోవడంతో పశువైద్యశాల అస్తవ్యస్త పరిస్థితుల్లో కొనసాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో వందలాది ఎద్దులు, ఆవులు, మేకలు,గొర్రెలు ఉండగా,వాటి ఆరోగ్య సంరక్షణకు కీలకమైన పశువైద్యశాల మాత్రం పాడైపోయిన భవనంలోనే నడుస్తోంది. పైకప్పు పగిలిపోవడం,గోడలు చెదిరిపోవడం,తలుపులు సరిగా లేకపోవడం వంటి సమస్యలు అక్కడి పరిస్థితిని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.పైకప్పు పెద్ద పెద్ద చిల్లులు పడటంతో వర్షాకాలంలో మందులు, పరికరాలు తడవడం,వాటిని సరిగా నిల్వచేయలేకపోవడం సాధారణంగా మారిందని పశుపోషకులు వాపోతున్నారు.విద్యుత్ సరఫరా అంతరాయం,తాగునీరు,మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో చికిత్సా సేవలు ఇబ్బందికరంగా సాగుతున్నాయని తెలిపారు.అంతేకాకుండా వర్షాకాలంలో వర్షపు నీటితో పాటు విష సర్పాలు కూడా ఆసుపత్రి లోపలికి వస్తుండటంతో వైద్యసిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రి సిబ్బంది తమ సొంత ఖర్చులతో తాత్కాలిక మరమ్మతులు చేయించినా, పరిస్థితి మళ్లీ మొదటిదశకే చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.పశుపోషకులు మాట్లాడుతూ, ప్రభుత్వం పశుసంవర్ధక రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ, మున్సిపాలిటీ పరిధిలో పశువైద్యశాలకు శాశ్వత భవనం కల్పించకపోవడం విచారకరమని అన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి కొత్త భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.పశువైద్యాధికారి కూడా శిథిలావస్థలో పని చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, శాశ్వత భవనం ఏర్పాటైతే సేవలు మెరుగుపడతాయని తెలిపారు.ప్రజాప్రతినిధులు,సంబంధిత శాఖ అధికారులు స్పందించి పశువైద్యశాల భవన నిర్మాణానికి తక్షణమే నిధులుకేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి సభ స్థలం, మోడల్ హౌజింగ్ కాలనీని సందర్శించిన కలెక్టర్

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ఈనెల 14న హుజూర్‌నగర్ పణిగిరి శ్రీ సీతరామచంద్రస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ హౌజింగ్ కాలనీని ప్రారంభించేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించి ప్రజల ఉద్దేశించి ప్రసంగించనున్నారని అన్నారు. గురువారం సిఎం సభాస్థలిని, వాహనాల పార్కింగ్, ఇతరాత్ర ఏర్పాట్లపై కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టపై 110 ఎకరాలలో నిర్మించిన మోడల్ హౌజింగ్ కాలనీని ఈనెల రెండవ వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నారని తెలిపారు. మోడల్ హౌజింగ్ కాలనీని ఇందిరమ్మ ఇండ్లు, బ్లాకులు అంతర్గత రోడ్లు, సభాస్థలిని, పార్కింగ్‌పరిశీలించి పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వారంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను అదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హతలేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని స్పష్టం చేశారు. అంత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యత ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి సిద్దార్థ, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, తహసిల్దార్ కవిత పాల్గొన్నారు.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం 7కు వాయిదా

ప్రజాపక్షం/నల్లగొండ : పరిపాలన పరమైన కారణాల వల్ల ఈనెల 6న నిర్వహించాల్సిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశాన్ని ఈనెల 7న ఉదయం 10 గంటలకు ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేసి ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్‌డిఓలు,తహసిల్దారులు,ఎంపీడీవోలు,మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజులపాటు నిర్వహించే ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రధాన అంశాల వారీగా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.మొదటి అంశమైన పరిసరాల పరిశుభ్రత,ఫైళ్ల పరిష్కరణ కార్యక్రమాన్ని మార్చి 6 నుండి 15 వరకు అన్ని కార్యాలయాలు,ప్రభుత్వ సంస్థల్లో చేపట్టి పెండింగ్ ఫైళ్లను మార్చి 15 నాటికి పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,దేవరకొండ ఆర్‌డీఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఫోటో గ్రాఫర్స్ మండల అధ్యక్షుడిగా సాయి గౌడ్

ప్రధాన కార్యదర్శిగా మందుగుల సాయికిరణ్

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండల ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గంగాపురం సాయి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మందుగుల సాయికిరణ్, ఉపాధ్యక్షులుగా ఉదావత్ దినేష్, కోశాధికారిగా నీళ్ల శివ, ప్రచార కార్యదర్శిగా నూతి సైదులు, సహాయ కార్యదర్శిగా నీళ్ల కిరణ్, చిలివేర్ శేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పాలకుర్ల యాదయ్య, ఎస్కే పాషా, కొండ శ్రీకాంత్, ఓరుగంటి లింగస్వామి, అలాగే ఫోటో గ్రాఫర్స్ నీళ్ల రాజు గౌడ్, వంగరి సాయి, బొంగు మధు, మొగిలిపాక రఘుపతి పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండల పరిధిలోని మునిపంపుల గ్రామానికి చెందిన తాళ్ల లింగస్వామి కుమార్తె వివాహము రామన్నపేట పట్టణ కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్‌లో జరగగా అట్టి వివాహంకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండి.అమీర్, జిల్లా నాయకులు బద్దుల రమేష్ పాల్గొన్నారు.

సిసిరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో మార్కండేయ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో డ్రైనేజ్, మంచినీటి, సిసి రోడ్ల సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంతో ప్రారంభించినట్లు తెలిపారు. రోడ్లు పూర్తయితే ప్రజలకు రాకపోకలు సులభం అవుతావని వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. కాలనీ ప్రజలు సిసి రోడ్ల నిర్మాణం ప్రా రంభం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వార్డు సభ్యులు పందుల యాదగిరి, సూరపల్లి వెంకటేశం, సింగపంగ ప్రశాంతి, కట్ల వనజ పాల్గొన్నారు.

ఫ్యాన్లు అందజేత

ప్రజాపక్షం/ఆత్మకూరు (ఎం) : మండల కేంద్రంలోని రజక సహకార సంఘం భవనంకు ఎలిమినేటి వెంకటయ్య స్మారకార్థం వారి కుమారులు స్వామి, మచ్చగిరి గురువారం 5 ఫ్యాన్లను బహుకరించారు. ఈ సందర్భంగా దాతలను రజక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎలిమినేటి మురళీకృష్ణ, పైళ్ల ప్రశాంత్, మాజీ అధ్యక్షుడు వేలిమేకన్నె సత్యనారాయణ పాల్గొన్నారు.

భూమి పట్టా చేయాలని మందు డబ్బాతో వృద్ధుల ఆందోళన

ప్రజాపక్షం/మోతె : భూమి పట్టాకై మందు డబ్బాతో తహశీల్దార్ కార్యాలయం ముందు వృద్ధ దంపతులు జంపాల నర్సయ్య ఆందోళన నిర్వహించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాలతో వృద్ధులు ఆవేదనతో మాట్లాడారు. గడిచిన 15 సంవత్సరాల నుండి సర్వే నంబర్ 852, 850లో గల మా భూమి సుమారు 7 00 ఎకరాలు పట్టాకాకుండా మా పాలి భాగస్తులైన జంపాల పుల్లయ్య, నర్సయ్య, జానయ్యలు అధికార పార్టీ నాయకుల అండతో మా భూమి మీదకు పోకుండా దాడులు చేస్తున్నారని తెలిపారు. దౌర్జన్యంగా మాకు భూమి దక్కకుండా చేస్తున్నారని బోరుమంటు విలపించారు. మాపై గ్రామంలో కొందరు దాడులు చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఏం ప్రయోజనం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. నాకు ఉన్న ఇంటి స్థలం పై కూడా జులుం చేసి ఆక్రమణ చేశారని తెలిపారు. గడిచిన 4 సంవత్సరాల క్రితం తహశీల్దార్ కాసులకు కక్కుర్తి పడి మా భూమిని మాకు తెలువకుండా పట్టా చేశారని ఆరోపించారు. వెంటనే ఆ పట్టాను రద్దు చేసి మాకు పట్టా ఇప్పించాలని అధికారులను వేడుకున్నారు. ఎవరికి చెప్పినా ఏమి లాభం లేదని న్యాయం జరగడం లేదని పురుగుల మందు డబ్బాతో భార్యభర్తలు నిరసన చేపట్టడంతో కార్యాలయం సిబ్బంది మందు డబ్బాలు బలవంతంగా గుంజుకున్నారు.

తహశీల్దార్ యం వెంకన్న వివరణ...

ఇదే విషయమై తహశీల్దార్ యం వెంకన్నను వివరణ కోరగా గడిచిన 4 సంవత్సరాల క్రితం అట్టి భూమి పట్టా చేశారు. నా కంటే ముందు ముగ్గురు తహశీల్దార్‌లు మారారు. భూమి సమస్య అన్నదమ్ముల భాగస్వామ్యంతో ఏర్పడిన వివాదం సుమారు 15 సంవత్సరాల నుండి భూమి బీదుగా ఉన్నది. వృద్ధులు అయిన నర్సయ్య దంపతులు భూమిని సాగు చేసుకుంటే భూమికి పట్టాను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

సమస్యలను సమీక్షించి పరిష్కరిస్తాం

ప్రజాపక్షం/చిట్యాలః పట్టణంలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని సమీక్షించి పరిష్కరించేందుకు తమ పాలక వర్గం అహర్నిశలు కృషి చేస్తుందని నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్ అన్నారు. పాలన ప్రగతి, 99 రోజుల కార్యాల చరణ ప్రణాళిక గురించి గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం జరిగింది. 99 రోజులలో వార్డులలో తీసుకోవల్సిన కార్యక్రమాల గురించి కౌన్సిలర్లతో కలిసి ఆమె చర్చించిన సందర్భంగా మాట్లాడుతూ అన్ని వార్డులలో మౌళిక వసతుల కల్పనకు ముందు ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందన్నారు. ప్రజలకు కావల్సిన మంచి నీటి సరఫరా, వీధి దీపాలు, మురికి కాలువల మరమ్మత్తులు, కొత్తవి నిర్మాణాలు లాంటి విషయాలలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. 12వ వార్డు నుండి పాలన ప్రగతి కార్యక్రమం ప్రారంభమవుతుందని గీతారమేష్ అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దండు శ్రీను, కౌన్సిలర్‌లు వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కోనేటి ఎల్లయ్య, కుక్కల మోహన్, ఏర్పుల పరమేష్, దేశపాక శ్రీలత, బొబ్బలి సందీప పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) : ఆత్మకూర్(ఎస్) మండలంలోని పాతర్లపహాడ్, హరిజన వాడ ప్రాథమిక పాఠశాలలను సూర్యాపేట జిల్లా అకడమిక్ ప్యానల్ పర్యవేక్షణ బృందం నోడల్ అధికారి వాంకుడోత్ వెంకన్న నాయక్, సభ్యులు కస్తూరి కిషన్ ప్రసాద్, గునగంటి నరసింహారావులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మండల విద్యా శాఖాధికారి ధారాసింగ్ కూడా పాల్గొని విద్యార్థిని విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యనే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసిన ప్యానల్ ఇన్‌స్పెక్షన్ కమిటీలు తమ బాధ్యతను నిబద్ధతతో పరిశీలిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు సంపూర్ణంగా పర్యవేక్షణ చేస్తూ, సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వానికి నివేదికలు అందించే దిశలో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సన్నీళ్ల అంజయ్య, కవిత, గ్రేస్ ఉపాధ్యాయులు సైదులు, సుధాకర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : రాష్ట్రస్థాయి గుర్తింపుతోపాటు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతు భాస్కర్ లు అన్నారు. గురువారం సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు కుప్పిరెడ్డిగూడెంలో ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో జెఈఈ మెయిన్స్ 2026లో స్టేట్ 3వ ర్యాంక్ వచ్చిన సిహెచ్ శివకుమార్‌ను వారు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎక్కటి శేఖర్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, నాయకులు పందిరి మల్లేష్, కనుక వెంకన్న, బోల శేఖర్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, శోభన్ బాబు, తల్లిదండ్రులు సత్తయ్య, పుష్పలత పాల్గొన్నారు.

అంధుల గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : అంధుల గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వంగవీటి రామారావు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో అంధుల గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ గ్రంథాలయంలో అంధులు బ్రెయిలీ లిపితో చదువుకునేందుకు సుమారు 50 మందికి సరిపోయే విధంగా స్పీకర్లు, రెండు కంప్యూటర్లు, రామాయణం, భాగవతం, 5 10 తరగతుల పుస్తకాలు కాకుండా ఇంకా ఇతర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో స్థానంలో మన సూర్యాపేటలో అంధుల గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడంతో సిఎం రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బి బాలమ్మ, అసిస్టెంట్ లైబ్రెరియన్ శ్యాంసుందర్ రెడ్డి, శ్రవణ్, సిబ్బంది సృజన, భవాని, నిర్మల పాల్గొన్నారు.

అదనపు బస్సు సౌకర్యం కల్పించిన మున్సిపల్ చైర్మన్

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి దిల్ సుఖ్‌నగర్‌ల మధ్య ప్రజల రవాణా సౌకర్యాల ప్రయోజనాల కోసం పోచంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి చొరవతో డిపో మేనేజర్ సహకారంతో గురువారం జెండా ఊపి రెండు బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలు విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు పోచంపల్లి నుండి హైదరాబాదుకు వెళ్లి తిరిగి వచ్చేందుకు అదనపు బస్సులను నడపాలని కోరిన వెంటనే రెండు బస్సులను కేటాయించినందుకు ఎమ్మెల్యేకు ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్స్ మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, టౌన్ అధ్యక్షుడు భారత లవ కుమార్, డిపో మేనేజర్ టి.సమంత, ఏడిసిలు శ్రీనివాస్ రెడ్డి, వివిఎన్ రావు, బుచ్చిరెడ్డి, నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు గుణిగంటి రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

పేదల కోసం వైద్య శిబిరాలు

ప్రజాపక్షం/అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా పేదల కోసమే ప్రత్యేక వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ భూక్యా నగేష్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వైద్యశాలలో పల్లె ప్రాంతంలో ఉండే వారికి దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులకు కాకుండా ఈ వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులైన వారిచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశామన్నారు. అందులో భాగంగా 280 మందికి మందులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆయేషా, యశ్వంత్, అరుణ్ నాయక్, నిఖిల్ గూడపూరి, ఏ శాలిని, హరిప్రియ, సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్, నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసిన దైద

ప్రజాపక్షం/నకిరేకల్ : హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో గురువారం వేములవాడ ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దైద రవీందర్ మర్యాదపూర్వకగా కలిసి శాలువాతో సత్కరించి పూల బొకే అందించారు. వారి వెంట ఆ పార్టీ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి ఉన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాపక్షం/నకిరేకల్ : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడి వివాహ మహోత్సవానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అలాగే హైదరాబాద్‌లో జరిగిన గగేనపల్లి కరుణాకర్ రెడ్డి కుమార్తె వివాహానికి కూడా హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

జూనియర్ సివిల్ కోర్టు ముందు కల్వర్టు శుభ్రపరిచిన మున్సిపల్ సిబ్బంది

ప్రజాపక్షం/నకిరేకల్ : పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ముందు ఉన్న పెద్ద మురికి కాలువపై నిర్మించిన కల్వర్టుపై పేరుకుపోయిన చెత్తను గురువారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి, కల్వర్టుపై పేరుకుపోయిన మురుగు మరియు చెత్తను పూర్తిగా తొలగించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు కూడా చెత్తను కాలువల్లో వేయకుండా సహకరించాలని సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంజిత్ కుమార్,సీఐ హరి బాబు,కాంగ్రెస్ నాయకులు స్వప్న,నిర్మలతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తండాలలో హోలీ సంబరాలు

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; మండల పరిధిలోని గన్యనాయక్ తండా, దంజిలాల్ తండాలలో గురువారం గిరిజనులు హోలీ వేడుకలను సర్పంచ్ రమావత్ రామునాయక్, రిటైర్డ్ ఆబ్కారి సిఐ దంజిలాల్, గన్యనాయక్ తండా సర్పంచ్ రమావత్ గోజి, రతన్‌లాల్‌ల ఆధ్వర్యంలో ఉత్సహ భరితంగా జరుపుకున్నారు. ఐదు సంవత్సరాలకు ఒక సారి హోలీ వేడుకలను జరుపుకోవడం వలన తండాలోని మహిళలు, యువకులు, పెద్దలు, చిన్నారులు, ప్రజా ప్రతినిధులంతా ఆనందంగా ఎంతో ఉల్లాసంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జగన్‌నాయక్, రమావత్ తుకారం, ఉప సర్పంచ్ దశరథ, రమావత్ కృష్ణ, పాండు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పట్టణంలోని యాటకన్నా రెడ్డి కాలనీలో ఉన్న న్యూస్ పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ ఎస్‌పి రమేష్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని,క్రమశిక్షణతో పాటు బాధ్యతా భావం పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల చైర్మన్ గంట్ల అనంత రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనలు పెంపొందించేందుకు స్వపరిపాలన దినోత్సవం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు నాయకుల వేషధారణతో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో హెడ్ మిస్ట్రెస్ గంట్ల పద్మ,ప్రిన్సిపల్ అలుగుబెల్లి తిరుమల్ రెడ్డి,స్పందన,ఫాతిమా,పర్వత రెడ్డి,జగన్ రెడ్డి, సాయి కృష్ణతో పాటు ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సేంద్రియ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

ప్రజాపక్షం/తుర్కపల్లి : మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి శాస్త్రవేత్త ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ, మండల వ్యవసాయ అధికారి ఉమా రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ అందించి, దేశవాళి ఆవుపేడ, ఆవుమూత్రం ద్వారా జీవామృతం, ఘనజీవామృతం, అగ్ని అస్త్రం, తేమాస్త్రం, ఇతర సేంద్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ పద్ధతులు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన నేల, ప్రకృతి సంరక్షణతో పాటు వ్యవసాయ సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని వివరించారు. రైతులందరూ విధిగా సేంద్రియ వ్యవసాయ సాగును ప్రోత్సహించాలని, భావితరాల భవిష్యత్తును కాపాడాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమల వెంకటేష్, ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, ఏఈఓ పృథ్వీరాజ్, తిరుమల రావు, రాకేష్ జెస్సి, దివ్య, కావ్య, ఏటీఎం, ఏ బిటిఎం మమత, రైతులు రమేష్, రాజు, సుధీర్ రెడ్డి, నల్ల సత్తయ్య, సింగం రవీందర్, ధరావత్ శ్రీధర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ఉంటే విజయం సులువు

ప్రజాపక్షం/నకిరేకల్: విద్యార్థులు చిన్నప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని కష్టపడి చదివితే విజయం సాధించడం సులువని ప్రముఖ మోటివేటర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం చెరువు అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమంలో ఆయనతో పాటు సాయికిరణ్ విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు. గురువారం చెరువు అన్నారం జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు.మార్చి 14 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ పై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలోని 9వ,10వ తరగతులకు చెందిన 40 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, కోటిలింగం, నగేశం, లింగయ్య, సంపత్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బోనాలు సమర్పించిన భక్తులు

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : మండలంలోని కుప్పిరెడ్డిగూడెం శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవాలయంలో గురువారం భక్తులు బోనాలు సమర్పించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతు భాస్కర్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ప్రజలందరూ స్వామి అమ్మవార్ల దయతో సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య అనుగ్రహం ప్రతి ఇంట్లో వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎక్కటి శేఖర్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, నాయకులు పందిరి మల్లేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య లక్ష్మి నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య లక్ష్మీ నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కురుమిళ్ళ కవిత శ్రీను హాజరై మాట్లాడుతూ పిల్లలను తప్పని సరిగా అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ కచ్చిగళ్ల మహేష్, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, ఆయా గౌరమ్మ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథేశ్వర బ్రహ్మోత్సవాలు

ప్రజాపక్షం/నకిరేకల్: మండల పరిధిలోని గురజాల గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ విశాలాక్షి సమేత సమేత కాశీ విశ్వనాధేశ్వర బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి.భక్తులతో జన సంద్రోహంగా మారి కిటకిటలాడింది.ఈ నెల 04 నుంచి నిర్వహించిన తృతీయ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమాలు గురువారం పూర్తి అవ్వడం తో గ్రామం మొత్తం భక్తి శ్రోభ సంతరించుకుంది. సర్పంచ్ ఎర్ర రోజాసుధాకర్ ఆధ్వర్యంలో శ్రీ విశాలాక్షి కాశి విశ్వనాధేశ్వర శాంతి కళ్యాణం ఘనంగా నిర్వహించారు.ఈమహోత్సవాల సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కందాల సమరం రెడ్డి,చామల,జైపాల్ రెడ్డి,శేఖర్ బాబు, చింత ధనుంజయ,యంగలి రామకృష్ణ గౌడ్, వేముల గోపీనాథ్,వడ్లకొండ పరమేష్ గౌడ్‌పాల్గొన్నారు.

విబిజి రాంజీ బిల్లు రద్దు చేయాలి

ప్రజాపక్షం/నకిరేకల్: వీబీజీ రాంజీ బిల్లును రద్దు చేసి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి నాగయ్య డిమాండ్ చేశారు.గురువారం స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో బొజ్జ చిన్న వెంకులు అధ్యక్షతన జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఉపాధి కూలీలకు చేసిన పనులకు వెంటనే వేతనాలు చెల్లించాలని, గత నాలుగు వారాలుగా పని చేసిన కార్మికులకు ఇంకా కూలి అందలేదని అన్నారు. కొత్త చట్టం ద్వారా కార్మికుల సంక్షేమ సౌకర్యాలు తొలగిస్తున్నారన్నారు. ఈసమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య,జిల్లా నాయకులు కంబాలపల్లి ఆనంద్,జటావత్తు రవి నాయక్.సుకన్య.చింతపల్లి లూర్దు మారయ్య,మన్నె బిక్షం, గండమల్ల రాములు,మర్రి వెంకటయ్య పాల్గొన్నారు.

మహిళా సంఘటితశక్తికి వేదికలు స్త్రీ శక్తి భవనాలు

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : మహిళా సంఘటితశక్తికి వేదికలుగా స్త్రీ శక్తి భవనాలు నిర్మాణమవుతున్నాయని పోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ తడక వెంకటేశ్వర్లు అభివర్ణించారు. పోచంపల్లి మండలం శివారెడ్డి గూడెంలో గురువారం అయిన ముఖ్యఅతిథిగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, సర్పంచ్ బొక్క మల్లారెడ్డి ఉపసర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్‌లతో కలిసి మహిళా శక్తి భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉప్పునూతల వెంకటేష్, పోచంపల్లి టౌన్ అధ్యక్షులు భారత లవకుమార్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాపక్షం/నకిరేకల్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికి హైదరాబాదులో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుభాకాంక్షలు తెలిపారు.ఆయన రాజకీయ ప్రస్థానం మరింత విజయవంతం కావాలని, ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాపక్షం/నకిరేకల్ :మండలం చందుపట్ల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ విద్యార్థి బుచ్చాల రాజేష్‌కు బిఆర్ఎస్ నకిరేకల్ మండల యువజన అధ్యక్షుడు పేర్ల కృష్ణకాంత్ రూ.75 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను గురువారం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ సహాయం చేసినట్లు తెలిపారు.ప్రస్తుత కాలంలో విద్యలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు.

వార్డుల్లో సమస్యలు గుర్తించాలి

ప్రజాపక్షం/హాలియా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి 99 రోజుల ప్రణాళికలో పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు.గురువారం హాలియా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డు అధికారులకు, కౌన్సిలర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళికలో అమలు చేయాలని అందుకు ప్రతి ఒక్కరు ఆయా వార్డులు తిరగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్,అన్ని వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాపక్షం/నందికొండ: మహారాజుల సేవా సంఘం ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ మోడల్ హై స్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధన కోసం క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. చదువులో రాణించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బద్రి,వీరబాబు,నకులరావు, పుల్లారావు,సతీష్,షాను,జ్యోతి, అనూష,నాగరాజు,ప్రధానోపాధ్యాయులు శేషు,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : సూర్యాపేట పట్టణంలోని సుందరయ్య నగర్ ప్రాంతంలో వ్యవసాయ భూమిలో గల వేప చెట్టుకు చీరతో ఉరివేసుకొని ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చింది. మృతుడు సుమారు 30 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలవాడిగా భావిస్తున్నారు. అతను బ్లూ రంగు పూర్తి చేతుల చొక్కా, ఎరుపు రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తి వివరాలపై ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.

యువత ఆలోచనలతో వికసిత్ భారత్ సాధ్యం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: యువత ఆలోచనలతోనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మారం రమణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్2026 కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు.ప్రిన్సిపల్ ఉపేందర్ మాట్లాడుతూ యువత ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఈ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యూరీ సభ్యులు భగవంత్ రెడ్డి,శీలం యాదగిరి,మంజుల,చకిలం, గురవయ్య, సురేష్ గుప్తా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నోడల్ కోఆర్డినేటర్ కోటయ్య,వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పరంగి రవికుమార్,డాక్టర్ బొజ్జా అనిల్ కుమార్,డాక్టర్ ఆదె మల్లేశం పాల్గొన్నారు.

రీసర్వేతో భూముల శాశ్వత పరిష్కారం

ప్రజాపక్షం/నూతనకల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేతో భూములకు శాశ్వత పరిష్కారం చేకూరుతుందని తహశీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో గ్రామాలలో ఉన్న అన్ని భూములకు సర్వే చేసి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించవచ్చని తెలిపారు. సర్వే చేసిన రైతులకు భారతి చట్టం ప్రకారం భూ ఆధార్ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలో రీ సర్వే చేయుటకు నూతనకల్, గుండ్లసింగారం, పెద్దనెమిల, ఎర్రపహాడ్, ఎడవెల్లి, దిర్శనపల్లి, చిల్పకుంట్ల, మిర్యాల, మాచినపల్లి, గ్రామాలను మొదటి విడతగా ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : కుటుంబ, వృత్తి బాధ్యతలను నిబద్ధతగా నిర్వహిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే మహిళా ఉద్యోగులు క్రీడలలో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని టిఎన్‌జిఓఎస్ భవన్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అన్నారు.ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ మహిళా విభాగం,జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని టిఎన్‌జిఓఎస్ భవన్ ఏర్పాటు చేసిన క్రీడలను జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలలో 56 శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొని క్యారమ్స్, చెస్, మ్యూజికల్ చైర్ ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఈనెల 6న ఉదయం 11:00ల నుండి మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.అదేవిధంగా7న మహిళా ఉద్యోగుల సభ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా అధికారులు పాల్గొంటారని తెలిపారు.

మెగాఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/కోదాడ: కోదాడ పెన్షనర్ల సంఘం భవనంలో ఈనెల 7న శనివారం నిర్వహించే మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల స సీతరామయ్య అన్నారు. గురువారం కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, సంఘ సభ్యులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. సోమాజీగూడ యశోధ ఆసుపత్రి వారి సౌజన్యంతో నిపుణులైన వైద్య బృందంచే న్యూరో, గుండె, ఆర్థో వైద్యుల బృందం రానున్నారని తెలిపారు. ఈసిజి, 2డి ఎకో, ఎముకల సాంద్రత వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించబడతాయని ఈ అవకాశాన్ని ఉద్యోగులు, పెన్షనర్లు, సామాన్య ప్రజలు అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోదాడ సంఘ కార్యాలయంలో ముందుగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు, శ్యాంసుందర్‌రెడ్డి, రఘువరప్రసాద్, జానయ్య, విద్యాసాగర్, బ్రమరాంబ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామ ప్రజలకు త్రాగునీరు, నిత్య అవసరాలకు అవసరమైన నీరుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య అన్నారు. మండలంలోని గణపవరం గ్రామంలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య రాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో గ్రామీణ జల సరఫరా శాఖ (ఆర్‌డబ్లుఎస్) అధికారులు ఈఈ శ్రీనివాసరావు, డిఈ దేవభిక్షం, ఏఈ రవి నాయక్‌లను గ్రామానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న తాగునీటి పరిస్థితులను వారికి వివరించి, బోర్ బావులు, చేతి పంపులను అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శంకరశెట్టి కోటేశ్వరరావు, కాసాని సత్యం, నల్లాని చెన్నయ్య, రామారావు, హీరం, నాగస్వరూప్, కృష్ణయ్య, రవి పాల్గొన్నారు.

ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఇరాన్‌పై యుద్ధాన్ని అమెరికా, ఇజ్రాయిల్‌లు ఆపాలని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక డిమాండ్ చేసింది. సామ్రాజ్యవాద దాడులను ఖండించాలని కోరుతూ సూర్యాపేట కొత్తబస్టాండ్ దగ్గర సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. అనంతరం కన్వీనర్ లింగంపల్లి భద్రయ్య మాట్లాడుతూ అమెరికా అమానుషంగా చిన్న పిల్లలు చదివే పాఠశాలలపై, ఆసుపత్రులపై దాడులను చేస్తూ యుద్ధనీతిని వదిలేసి దేశాలపైన ఆదిపత్యం కోసం జరిపేటటువంటి దాడిని వెంటనే ఆపి శాంతివాతావరణము కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అబ్దుల్ కరీం, రేపాక లింగయ్య, వీరన్న, గంట నాగయ్య, వెంకట్ యాదవ్, మాధవరెడ్డి, యోగానంద చారి, వెంకటయ్య, రాంసింగ్, షేక్ ఉమర్, కోటయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ

ప్రజాపక్షం/గుండాల; ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు,మౌలిక సదుపాయాలను అంచనా వేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ బృందం గురువారం గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేయడం జరిగింది. ఈసందర్భంగా నోడల్ అధికారి రవికిరణ్ మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలల పనితీరుపై ప్యానల్ ఇన్‌స్పెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, క్రీడలు, లైబ్రరీ నిర్వహణ, ఉపాధ్యాయుల డైరీలు, లెసన్‌ప్లాన్స్, ఎప్ ఎల్ ఎన్ ఉపాధ్యాయుల హాజరు, స్టాక్ రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఇన్‌స్పెక్షన్ బృందం సభ్యులు వనం వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ బందెల స్వప్నలత, ఉపాధ్యాయురాలు ఉషాకిరణ్, సిఆర్‌పి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామం అభివృద్ధి

ప్రజాపక్షం/తుర్కపల్లి : సమష్టి కృషితోనే గ్రామాభివృద్ధి చెందుతుందని, ప్రజలంతా అభివృద్ధికి సహకరించాలని చిన్న లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి అన్నారు. మండలంలోని చిన్న లక్ష్మాపూర్ గ్రామంలో గురువారం రచ్చబండ పరిధిలో గ్రామస్థుల సమక్షంలో సర్పంచ్ అధ్యక్షన గ్రామసభ నిర్వహించారు. వేసవికాలం ప్రారంభమైన సందర్భంగా గ్రామంలో మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూడవత్ పార్వతి చిన్న నాయక్, పంచాయితీ కార్యదర్శి రమాదేవి, వార్డు మెంబర్లు నర్సింహులు, మహేష్, నరేష్ నాయక్ గ్రామయువకులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి అమృతం కోకోనట్ జ్యూస్

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:సర్వరోగ నివారణతో పాటు సంపూర్ణ ఆరోగ్యానికి సహజ పానీయాలు ఎంతో ఉపయోగకరమని, ముఖ్యంగా కోకోనట్ జ్యూస్ సేవించడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని షాపు నిర్వాహకులు బత్తుల హరిబాబు తెలిపారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఆర్‌పి రోడ్ తాలూక్ దారి మసీదు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సత్యదేవ కోకోనట్ ట్రేడర్స్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టి.రాజు,వినయ్,సత్తిబాబు,శ్రీను,జి.కె.మూర్తి,సతీష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నూతన సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సన్మానం

ప్రజాపక్షం/మోత్కూర్ : మండలంలోని పొడిచేడు గ్రామ నూతన సర్పంచ్ జిట్టా సైదులు, ఉప సర్పంచ్ బండ పెద్ద లింగయ్యలు గెలుపొందిన సందర్భంగా గురువారం గ్రామ పెద్దలైన లెల్లెల (బొర్రా) యాదయ్య శాలువతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా లేల్లెల (బొర్రా)యాదయ్య మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజా ప్రతినిధిగా గెలిచిన సర్పంచ్ ఉప సర్పంచ్లు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కప్పే వెంకటేశం, ఓర్సు నాగులు ఇట్టబోయిన శ్రీకాంత్, సిరిగిరి ప్రవీణ్ పాల్గొన్నారు.

కిట్స్ మహిళా కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాపక్షం/కోదాడ: కోదాడ పట్టణంలోని స్థానిక కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్లపల్లి గాంధీ తెలిపారు. హైద్రాబాద్‌కు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ ఐన క్యూఎడ్జ్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. క్యూఎడ్జ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మానవ వనరుల నిర్వహణ అధికారి నరేంద్ర, రిక్రూట్‌మెంట్ హెడ్ ఎం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలో తమ కళాశాలకు చెందిన 7గురు బిటెక్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులకు వార్షిక వేతనం ఐదు లక్షల రూపాయలు ఉంటుందని కంపెనీ మానవ వనరుల అధికారులు నరేంద్ర, ప్రవీణ్‌కుమార్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నాగార్జునరావు, టిపివో పుష్పలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిట్యాల సురేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : చిట్యాల సురేష్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సురేష్ ఇంటికి వెళ్ళి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, టౌన్ అధ్యక్షుడు కుంభం నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల అంజయ్య, బొల్లె సైదులు, మధు, మామిడి శోభన్‌బాబు గౌడ్, వట్టె లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలి

ఆకుపాముల జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

ప్రజాపక్షం/మునగాల: మండల పరిధిలోని ఆకుపాముల జిల్లా పరిషత ఉన్నత పాఠశాలను, అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా ఆర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు తెలుసుకుని, విద్యార్థుల ముఖ గుర్తింపు విధానంలో హాజరు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. 7,8,9, 10 తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన విధానంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని తరగతులను పరిశీలించి విద్యార్థులతో అన్ని సబ్జెక్టులలో మాట్లాడించి వారి పఠన నైపుణ్యాలను పరిక్షించారు. పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత,. తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. పాఠశాలలో కూర్చిలు, బెంచీలు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులను అదేశించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామసభ తీర్మానాన్ని ధిక్కరించి కోళ్ల ఫారాల నిర్మాణం

గ్రామపంచాయతీ ముందు గ్రామస్తుల ధర్నా

ప్రజా పక్షం/మర్రిగూడ: మండలంలోని దామర భీమనపల్లి గ్రామంలో కోళ్ల ఫారాల నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తూ గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.గత వారం గ్రామ సభలో కోళ్ల ఫారాల నిర్మాణాలు చేపట్టకూడదని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినప్పటికీ, సంబంధిత యజమాని ఆ తీర్మానాన్ని పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామంలో కోళ్ల ఫారాలు ఏర్పాటు చేస్తే దుర్వాసన,ఈగలు, దోమలు పెరగడంతో పాటు ఆరోగ్య సమస్యలు తలె త్తే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. ము ఖ్యంగా

చిన్నపిల్లలు,వృద్ధులకు ఇబ్బందులు కలుగుతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామ ప్రజల అభిప్రాయాలను గౌరవించి వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయాలని గ్రామపంచాయతీ పాలకవర్గం జోక్యం చేసుకుని కోళ్ల ఫారాల నిర్మాణాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరాహార దీక్ష కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను పరిష్కరించాలని ఈనెల 30న హైద్రాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే నిరాహార దీక్ష,ఈనెల 9న కలెక్టరేట్ల వద్ద చేపట్టే నిరసన కార్యక్రమాల కరపత్రాలను గురువారం స్థానికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజిసైదులు మాట్లాడుతూ ఎన్నికల్లో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి రూ.12లక్షల ఆర్థిక సహాయం, అర్హులైన పేద దళితులకు మూడెకరాల భూమి, పారిశుద్ధ్య కార్మికలకు కనీస వేతనం

రూ.20వేలు చెల్లించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలుపుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకపంగు కాశయ్యమాదిగ, నాయకులు చీమలపాటి వెంకటయ్య, అందుగుల లక్ష్మణ్, కందుల చిన్నసైదులు, నూకపంగ శ్రీనివాస్, కొండేటి మధు, కొండేటి నరేష్, శేఖర్, కృష్ణయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో రాణించిన జీనియస్ విద్యార్థులు

ప్రజాపక్షం/భువనగిరి : భువనగిరి పట్టణంలోని జీనియస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తేదీ 12 నవంబర్ 2025 రోజున అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడు పోటీ పరీక్షల్లో పాఠశాలకు చెందిన 323 మంది విద్యార్థులు హాజరు కాగా ఇటీవల ప్రకటించిన ఇట్టి ఫలితాలలో 43 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. గురువారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నిర్వాహకులు అందజేసిన బంగారు పతకాలు ప్రశంసా పత్రాలు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి.సూర్యనారాయణ రెడ్డి, డైరెక్టర్ తోట శ్రీధర్ విద్యార్థులకు అందజేసి అభినందించారు. అనంతరం కరస్పాండెంట్ డాక్టర్ బి.సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పోటీ పరీ

క్షల్లో పాల్గొనడం వల్ల తమలో ఉన్న ప్రతిభను మెరుగుపరచుకోవడానికి నిరూపించుకోవడానికి ఇలాంటి పోటీ పరీక్షలు ఎంతగానో విద్యార్థులకు ఉపయోగ పడతాయని అన్నారు. విద్యార్థులు నిరంతరం పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల తమలో ఉన్న ప్రతిభను పెంపొందించు కోవడానికి పోటీ పరీక్షలు ఎంతగానో వారికి దోహదపడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి స్వర్ణలత, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సిసిరోడ్డు పనులను ప్రారంభం

ప్రజాపక్షం/గరిడేపల్లి: గ్రామాలు అభివృద్ధి చెందితనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అందుకు గ్రామాలే నిదర్శమని సర్పంచ్ కేతిపల్లి నర్సయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని పరెడ్డి గూడెం గ్రామంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆశీస్సులతో మంజూరైన ఆరు లక్షల రూపాయల వ్యయంతో సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేకల మల్లారెడ్డి, గరిడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి పెండెం శ్రీను, పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్

ప్రజాపక్షం/గరిడేపల్లి: మన భారతదేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ప్రతి ఒక్కరు ఓటు హక్కును కల్పించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిరస్మరణీయులని మండల విద్యాధికారి చత్రునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతేగాక విద్యార్థులు పొరులుగా ఓట్లు వేశారని, సాయంత్రం కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించి విజేతలను ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.సాయిలు, సిఆర్‌పిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ మనందరి లక్ష్యం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : వికసిత్ భారత్ ప్రతి ఒక్కరి లక్ష్యమని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ జాతీయ సేవ పథకం కోఆర్డినేటర్ ఆర్ వెంకటనారాయణ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 102 మంది విద్యార్థులు పాల్గొనగా ఐదుగురు విద్యార్థులను వికసిత్ భారత్ కార్యక్రమానికి ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ వి వెంకటేశులు, కళాశాల వైస్ చైర్మన్ కె రాజేందర్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు ఎస్ రవికుమార్, శ్రీవాణి, జె అశోక్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని విద్యార్థులు కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త మాశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. పట్టణంలోని వాసవీనగర్‌లోని ఎస్‌వీ మోడల్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ డే వేడుకలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో 570కు పైగా మార్కులు సాధించే విద్యార్థులకు రూ.5వేల నగదు బహుమతి అందిస్తానని ప్రకటించారు. పాఠశాల డైరెక్టర్ విశాలక్ష్మీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10 తులాల బంగారం అపహరణ

ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ పట్టణంలో గురువారం మధ్యాహ్నం భారీ దొంగతనం జరిగింది. శాతవెల్లి శ్రీనివాస్‌రావు దంపతులు ఇంటికి తాళం వేసి బ్యాంకుకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు వెనుక వైపు తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు రూ. 16 వేల నగదును దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో సిఐ వెంకట్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పట్టణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

బోరు బావిలో మోటర్ బిగించిన సర్పంచ్

ప్రజాపక్షం/మర్రిగూడ: వేసవిని దృష్టిలో పెట్టుకొని లెంకలపల్లి గ్రామపంచాయతీ నాలుగో వార్డ్‌లో నీటి సమస్య ఉండటంతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో గురువారం సర్పంచ్ అయితగోని పద్మ వెంకటయ్య కొత్త మోటర్‌ను బోరు బావిలో బిగించారు.ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్, వార్డు సభ్యులు కల్మర కల్పన, ఝాన్సీ రాణి,నరసింహ పాల్గొన్నారు. వా ర్డు ప్రజలు పాలకవర్గానికి ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాపక్షం/చండూరుః చండూరు మండలం ఇడికూడ గ్రామానికి చెందిన లారి డ్రైవర్ ఇరిగి వెంకన్న ఇటీవల కాలంలో మరణించారు. తన తోటి బంగారిగడ్డ గ్రామానికి చెందిన లారి డ్రైవర్లు మృతుడు వెంకన్న కుటుంబానికి ఆర్థిక భరోసాగా గురువారం 20వేలు ఆర్థిక సహాయంను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగి శ్రవణ్ కుమార్, ఆది సైదులు , ఇరిగి కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

సిసిరోడ్డు పనులు ప్రారంభం

ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్ ఆధ్వర్యంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధుల నుండి మైనంపల్లి గ్రామంలో మంజూరు అయిన రూ. 5లక్షల వ్యయంతో కూడిన సిసి రోడ్డు పనులను బీచ్యతండాలో మైనంపల్లి సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొర్ర రాంసింగ్‌నాయక్ అధికారులు, పాలకవర్గ సభ్యులతో కలిసి పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలునాయక్ పంచాయతీ రాజ్ డిఈ లింగారెడ్డి, ఏఈ శంకర్, వార్డు సభ్యులు కిషన్, లక్ష్మీ, ప్రశాంత్, సంతోష వెంకట్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు

ప్రజాపక్షం/డిండి; సమాజంలో జరిగే బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగాలని సిడిపిఓ చంద్రకళ అన్నారు. గురువారం ఎంపిడిఓ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటి సమావేశానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ చంద్రకళ హాజరై మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణ, బేటి బచావో బేటి పడావో పై అవగాహన కల్పించారు. ఈసమావేశంలో ఎంపిడిఓ వెంకన్న, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రేణుక, రమణ, అనిత, ఎపివో శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, పోలీస్ శాఖ, మండల సమాఖ్య అధ్యక్షులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వార్షిక ఆదాయం రూ.7 లక్షలు

ప్రజాపక్షం/బీబీనగర్ : మండలంలోని పడమటి సోమవారం గ్రామంలో గల శ్రీ లింగ బసవేశ్వర స్వామి వార్షిక ఆదాయం 70000 లక్షల 8వేల 814 వచ్చినట్లు ఆలయ ఈవో గోలి నరేందర్ రెడ్డి తెలిపారు. గురువారం స్వామివారి ఆలయ ప్రాంగణంలో గత ఫిబ్రవరి మాసంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి కళ్యాణోత్సవంలో రూ.34 వేలు కట్నకానుకలుగా వచ్చాయి. ఈ దేవాదాయ శాఖ పరిశీలకులు ఉత్సవ కమిటీ చైర్మన్ సంధిగారి బసవయ్య, ఆలేటి బలరాం, నడికుడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల విగ్రహాలను ఏర్పాటు చేసిన కుమారుడు

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : మండలంలోని దూపాడ్ గ్రామానికి చెందిన దివంగత పిన్నాని కనకయ్య, వెంకమ్మ దంపతుల విగ్రహాలను వారి చిన్న కుమారుడు, విద్యుత్ శాఖలో జెఏఓ పిన్నాని మల్లికార్జున్ ఏర్పాటు చేసుకున్నారు. గురువారం తన వ్యవసాయ క్షేత్రంలో తన తల్లిదండ్రుల విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు పేద కుటుంబంతో ఉంటూ రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడిపేవారన్నారు. వారి కష్టంతో నన్ను చదివించి ఉన్నతుడిని చేశారన్నారు. వారి జ్ఞాపకార్థం ఈ విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వారి సోదరి బావ కీత కనకయ్య కస్తూరిబాయ్ దంపతులు వచ్చిన బంధుమిత్రులకు మామిడి, నిమ్మ మొక్కలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మల్లికార్జున్, వసంత లక్ష్మి, జయంత్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాతో ఒప్పందం రైతులకు ఇబ్బందులు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: భారత ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందాల వల్ల భారతదేశంలోని రైతులు దివాలా తీస్తారని, గొడ్డలి పెట్టు అని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికాతో భారతదేశం చేసుకున్న ఒప్పందం వల్ల రైతుల ఆత్మహత్యలకు దారి తీస్తుందని, రైతాంగం దివాలా తీస్తారని, ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. అమెరికా ఇచ్చిన విత్తనాలతోనే దేశ రైతులు వ్యవసాయం చేయాల్సి వస్తుందని, రైతు ఉత్పత్తులను వారు ఇష్టారాజ్యంగా కొంటారని ఆయన ఆరోపించారు. అదేవిధంగా అమెరికా ఉత్పత్తులను, విత్తనాలను దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతం రెడ్డి, వెంకటేశ్వర్లు, రవినాయక్ పాల్గొన్నారు.

కనుకదుర్గ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నిమ్మల వెంకన్న

ప్రజాపక్షం/చండూరుః చండూరు మండలం బంగారిగడ్డ కనుకదుర్గ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నిమ్మల వెంకన్న గౌడ్ నియమితులైయ్యారు. ఉపాధ్యక్షుడుగా జక్కలి సందీప్ , ప్రధాన కార్యదర్శిగా వర్కాల గణేష్, జాయింట్ కార్యదర్శిగా బోయపల్లి సందీప్, కోశాధికారిగా సుంకరి యుగేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగారిగడ్డ గ్రామంతో పాటు మండలంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకోవడం తో పాటు యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సుంకరి శివ , ఇడికూడ మోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

ప్రజాపక్షం/తుర్కపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు షాదుల్లా టీమ్ ఆఫ్ సర్వీస్ ద్వారా పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఏప్రిల్ 10 నుంచి జరిగే వార్షిక పరీక్షలలో విద్యార్థులు కష్టపడి బాగా చదివి 100 శాతం ఉత్తిర్ణత సాధించి పాఠశాలకు, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని షాదుల్లా కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అధ్యాపక బృందం షాదుల్ల టీం సభ్యులు నాగపూరి సాయిరాం, ఆసిఫ్ బాలశంకర్, సాయి వంశీ, లోకేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట, అదిలాబాద్, కరీంనగర్, హన్మకొండ నందు నల్గవ తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆవిష్కరించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లా నుంచి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కొరకు ఈనెల 12లోపు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకున్న బాలబాలికలకు మండల స్థాయిలో ఎంఇఓ ఆధ్వర్యంలో ఈనెల 13 నుండి 17లోపు 9 మోటర్ క్వాలిటి టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లెయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బోర్డు జంప్, 800 మీటర్ల రన్, 6*10 మీటర్ల షుటల్ రన్, మెడిసన్ బాల్ పుట్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిల్టి లాంటి టెస్ట్ లు ఉంటాయన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 10 మంది బాలురు, 10 మంది బాలికలను ఎంపిక చేసి జిల్లాస్థాయిలో జరిగే ఎంపికకు పంపడం జరుగుతుందని వివరించారు. మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలకు జిల్లాస్థాయిలో ఈనెల 28 నుండి ఏప్రిల్ 1వ తేదీ లోపు జిల్లాస్థాయిలో టెస్టులు నిర్వహించి ఇందులో ప్రతిభ కనబరిచిన 10 బాలురు, 10 బాలికలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంపికకు పంపబడుతుందని వివరించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 4వ తరగతి విద్యార్థులు 8 నుండి 9 సంవత్సరాల మధ్య వయసు కలిగి (తేది.01.09.2017 నుండి 31.08.2018 మధ్య జన్మించిన వారై) ఉండాలన్నారు. స్టడి సర్టిఫికెట్ (ప్రస్తుతం చదువుతున్న స్కూల్ నుండి), జనన ధృవీకరణ పత్రం, ప్రస్తుతం దిగిన 5 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల బాలబాలికలు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశం కొరకు http://tgss.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాపక్షం/చండూరుః నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారి విమాన రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గుండ్రెడ్డి రమ్యా రామలింగారెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారి రథోత్సవాన్ని పురోహితుల సమక్షంలో వేదమంత్రోచ్చవాలతో భక్తులు రథాన్ని లాగారు. శుక్రవారం రోజు ఉదయం తెల్లవారుజామున అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు , వైస్ చైర్మన్ భూతరాజు దశరథ ,తుమ్మలపల్లి సర్పంచ్ బోయపల్లి రాజేష్, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయక బ్రహ్మోత్సవాలు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని విద్యానగర్‌లో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయం 22వ వార్షిక బ్రహ్మోత్సవాలను రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. మొదటి రోజు బుధవారం కలశ స్థాపన, మూలవిరాట్‌కు అబిషేకం, గణపతి హోమం నిర్వహించారు. రెండవ రోజు గురువారం సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి కల్యాణాన్ని వేద పండితులచే శాస్త్రోక్తంగా వైభవోపేతంగా నిర్వహించారు. భైరవపట్ల సీతారామశర్మ ఆధ్వర్యంలో ఈ కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు శ్రీవరసిద్ధి వినాయక దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు కాటేపల్లి నరసింహామూర్తిశర్మ, పులి కృష్ణమూర్తి శర్మలు తెలిపారు. కల్యాణానికి హాజరైన భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. కాటేపల్లి కృష్ణమోహన్, పుల్లాభట్ల లక్ష్మీ నారాయణ శర్మ, విశ్వనాథ వరప్రసాద్, కృష్ణమూర్తిశర్మ, భక్తులు పాల్గొన్నారు.

విబిజి రామ్ జి బిల్లును రద్దు చేయాలని మహాధర్నా

ప్రజాపక్షం/రామన్నపేట : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి గ్రామీణ పేదలకు ఉపాదిని దూరం చేసేందుకే విబిజి రామ్ జి బిల్లుని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహా, జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య అన్నారు. ఇటీవల మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబిజి రామ్ జీని రద్దుచేసి మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని రామన్నపేటలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ఉపాధి కూలీలతో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిపంపుల, దుబ్బాక గ్రామ సర్పంచులు బొడ్డుపల్లి వెంకటేశం, గట్టు నర్సింహా, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బోయిని ఆనంద్,విజయ భాస్కర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సన్మానం

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని రాజ్యసభ నామినేషన్ల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు జక్కలి ఐలయ్య మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఆయన ముఖ్యమంత్రిని శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలుపై ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని ఐలయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.